క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం


హోమంలో పాల్గొన్న భక్తులు

టంగుటూరు: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని జమ్ములపాలెం రజక బజారులో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడి వద్ద గ్రామస్తులు శనివారం భక్తిశ్రద్ధలతో గణపతి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

కనులపండువగా వెంకటేశ్వర స్వామి కల్యాణం


ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వరస్వామి

టంగుటూరు: ఆర్యవైశ్య గణేష్ ఉత్సవ కమిటీ 25వ వార్షిక గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ఆర్యవైశ్య బజారులో వెంకటేశ్వర స్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి తిరుమల తిరుపతి దేవస్థానం పురోహితులు పురాంకుశం రఘుప్రసాద్ స్వామి ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవ, తోమాల సేవ, కొలువు సేవ, అర్చన, సహస్త్ర కలశాభిషేకం, తురుప్పావడ సేవ(అన్న కూటోత్సవం), రాత్రి ఏడు గంటలకు స్వామి కల్యాణం, ఏకాంత సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మాలకొండ ఆదాయం రూ.11,74,616

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆదాయం శనివారం రూ.11,74,616 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. ఆదాయంలో భాగంగా కుంకుమార్చన రూ.25,120, తలనీలాలు రూ.59,975, ప్రత్యేక దర్శనం రూ.3,63,500, లడ్డుప్రసాదాలు రూ.1,86,095, అన్నదానం రూ.4,61,616, రూమ్‌అద్దెలు రూ.30,910 వచ్చినట్లు తెలిపారు.

కదిరి బాబూరావుకు సన్మానం


కదిరి బాబూరావును సన్మానిస్తున్న వాల్మీక్ యూత్

కనిగిరి రూరల్: మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావును వాల్మీకి యూత్ ఫోర్సు నాయకులు ఘనంగా సన్మానించారు. వినాయక నిమజ్జనం అనంతరం స్వామి శేషవస్త్రంతో సన్మానించి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. రక్షిత ఫార్మా కంపెనీ అధినేత చందన రామేశ్వరరావు, కదిరి రమణయ్య, మాజీ కౌన్సిలర్ ఎస్‌కే ఫయాజ్, ముత్యాల ప్రతాప్, నున్నా నారాయణ, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఏచూరికి ఘన నివాళి


ఏచూరికి నివాళులర్పిస్తున్న నేతలు

హనుమంతునిపాడు: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అకాల మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సీపీఎం నాయకుడు బడుగు వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని హనుమంతాపురంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు ఏలియా, రాములు అనోక్, వెలుగొండయ్య పాల్గొన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అధ్యక్షునిగా రమేష్


ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

టంగుటూరు: ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా చుండి రమేష్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా పారాబత్తిన శ్రీహరిబాబు, సెక్రటరీగా లకంతోటి కోటి, ట్రెజరర్‌గా కసుకుర్తి అనీల్, జాయింట్ సెక్రటరీగా నూతలపాటి కిరణ్, గౌరవ అధ్యక్షులుగా ఎస్‌కే బాషా, ఇతర సభ్యులను ఎన్నుకున్నారు.

చదువు కోసం.. వసతి కోసం!

- అధ్వానంగా కేజీబీవీ నిర్వహణ
- గదులు లేక తరగతి గదుల్లోనే నిద్రపోతున్న విద్యార్థినులు
- మరుగుదొడ్లు, స్నానపు గదులు లేక అవస్థలు
- కరెంట్, ఫ్లోరింగ్ సౌకర్యం లేక నిరుపయోగంగా గదులు
- నాడు–నేడుతో కొంతమేర పాఠశాల రూపురేఖలు మారిన వైనం
- ఇప్పుడు పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

పొన్నలూరు: కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు కరువై లక్ష్య సాధన పూర్తిగా కుంటుపడుతోంది. కస్తూర్బా విద్యాలయంలో సరిపడినన్ని తరగతి గదులు, మరుగుదొడ్లు, స్నానపు గదులతో పాటు సరైన వసతులు లేక పేద విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మాలపాడు గ్రామంలో సుమారు 12 ఏళ్ల క్రితం కేజీబీవీ పాఠశాలను ఏర్పాటు చేశారు. మొదటిగా పొన్నలూరులో మూడేళ్లు, కె. అగ్రహారంలో రెండేళ్లు అద్దె భవనాల్లో ఎన్నో ఒడిదుడుకుల మధ్య తరగతులు నిర్వహించారు. ఈ క్రమంలో అప్పటి ఎమ్మెల్యే జీవీ శేషు పాఠశాలకు పక్కా భవనం నిర్మించడానికి 2012లో మాలపాడు గ్రామంలో ఐదెకరాల స్థలాన్ని గుర్తించి రూ. 1.13 కోట్లు నిధులు మంజూరు చేసి ఐదు గదులు నిర్మించారు. అయితే పక్కా భవనం నిర్మించినా నేటికీ కనీస వసతులు లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కేజీబీవీ పాఠశాల్లో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు 250 మంది విద్యార్థినులు చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చి చదువుకుంటున్నారు.

నాడు–నేడుతో వసతులు

మొదట్లో ఐదు తరగతి గదులతో పక్కా భవనం ఏర్పాటు చేసినప్పటికీ ఆ తరువాత ఐదేళ్ల టీడీపీ ప్రభుత్వంలో కేజీబీవీ అభివృద్ధిని గాలికొదిలేశారు.


మాలపాడు కేజీబీవీ పాఠశాల

ఆ తరువాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు–నేడు పథకం ద్వారా సుమారు రూ. 80 లక్షలతో అదనంగా 11 గదులు నిర్మించడంతో పాటు టైల్స్, రంగులు, బల్లలు, డిజిటల్ బోర్డులు, మరుగుదొడ్ల మరమ్మతులు చేయించి చాలా వరకు పాఠశాల రూపురేఖలను మార్చివేశారు. అయితే నాడు–నేడు ద్వారా నిర్మించిన 11 గదులు 90 శాతం నిర్మాణ దశలో ఉన్నప్పుడు ప్రభుత్వం మారడంతో ప్రస్తుత ప్రభుత్వం మిగిలిన పనులను పూర్తి చేయలేదు. దీంతో కరెంట్, ఫ్లోరింగ్, కిటికీలు, తలుపులు ఏర్పాటు వంటి పనులు చేయకపోవడంతో నాలుగు నెలలుగా నిరుపయోగంగా పడి ఉన్నాయి.

అన్నీ సమస్యలే..

గత ఏడాది నాడు–నేడు ద్వారా 9 మరుగుదొడ్లు, 9 స్నానపు గదులు నిర్మించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇంటర్ చదువుకునే అవకాశం కల్పించడంతో ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థినుల సంఖ్య 250కి చేరింది. దీంతో మరుగుదొడ్లు, స్నానపు గదుల కొరత ఏర్పడింది. ముఖ్యంగా సరిపడినన్ని గదులు లేక పెట్టెలు, వస్తువులను విద్యార్థినులు తరగతి గదుల్లోనే ఉంచుతున్నారు. రాత్రి సమయంలో నిద్రపోవడానికి ప్రత్యేక హాల్ లేక తరగతి గదుల్లో నిద్రపోతున్నారు. ప్రహరీకి సంబంధించి అక్కడక్కడా గోడ కూలిపోవడంతో ఆ ప్రాంతం నుంచి రాత్రి సమయంలో ఆకతాయిలు పాఠశాల్లోకి ప్రవేశించే అవకాశం ఉందని విద్యార్థినులు భయందోళనకు గురవుతున్నారు. దీంతో పాటు కాంట్రాక్టర్ వారానికి సరిపడే కూరగాయలను ఒకే సారి తేవడంతో రెండు, మూడు రోజుల తరువాత తెచ్చిన కూరగాయలు కుళ్లిపోతున్నాయి. ప్రధానంగా ఆరు నుంచి తొమ్మిది వరకు ఇంగ్లీష్ టీచర్ లేరు.


కొంతమేర ప్రహరీ కూలిన దృశ్యం


అసంపూర్తి నిర్మాణం, నిరుపయోగంగా ఉన్న తరగతి గది

అసంపూర్తి గదులను పూర్తి చేయాలి



పాఠశాల్లో అసంపూర్తిగా ఉన్న గదులను పూర్తి చేసి కరెంట్, ఫ్లోరింగ్ సౌకర్యం కల్పించి వాడుకలోకి తేవాలి. గదులు లేకపోవడం వలన తరగతి గదుల్లోనే బ్యాగులు, వస్తువులు ఉంచి, రాత్రి సమయంలో అక్కడే నిద్రించాల్సి వస్తోంది.
– సీహెచ్ మైథిలి, తొమ్మిదో తరగతి

రాత్రి సమయంలో భయమేస్తోంది



పాఠశాలకు చుట్టూ ప్రహరీ ఉన్నప్పటికీ అక్కడక్కడా గోడ కూలిపోవడంతో రాత్రి సమయంలో ఎవరైనా ఆకతాయిలు లోపలికి వస్తారని భయమేస్తోంది. దాతలు స్పందించి పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలి.
– ఎం. శృతి, ఇంటర్

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ యాసీన్

కనిగిరి రూరల్: అంగన్‌వాడీ కార్యకర్తల, ఆయాల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ యాసీన్ అన్నారు. స్థానిక దరిశి చెంచయ్య భవన్‌లో శనివారం అంగన్‌వాడీ వర్కర్స్, అండ్ హెల్పర్ యూనియన్ అసోసియేషన్ సమావేశం సంగు సుజాత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ యాసీన్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలను, ఆయాలను అధికారులు బెదిరించి మానసిక వత్తిడికి గురి చేయడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన ఫోన్లు పనిచేయకపోవడంతో సొంత నిధులతో ఫోన్లు కొనుగోలు చేసి అంగన్‌వాడీల్లో వివిధ పథకాలకు సంబంధించిన యాప్‌లను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పనికి తగ్గ వేతనం ఇవ్వాలని, కనీస వేతనం అమలు చేయాలని, విధుల్లో చనిపోయిన వారికి రూ.5 లక్షలు పరిహారం, ఇంట్లో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. ప్రజా సాధికారిక సర్వేలో నమోదు కాకుండా చేయాలని, అంగన్‌వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వై రవీంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించడంలో విఫలం చెందిందన్నారు. అధికారులు రాజకీయ వత్తిళ్లతో వేధింపులకు గురిచేస్తే సహించేది లేదన్నారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు గుజ్జుల బాలిరెడ్డి, ఎస్‌కే ఖాశింవలి, అంగన్‌వాడీ జిల్లా నాయకురాలు విజయకుమారి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏఐటీయూసీ అనుబంధ అంగన్‌వాడీ యూనియన్ ప్రాజెక్టు స్థాయి నూతన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా సంగు శైలజ, సభ్యులుగా రాపూరి దుర్గ, ఎస్‌కే జులేఖ, సోడా వీర నారాయణమ్మ, కొప్పనపూడి పద్మలతో పాటు మరి కొందరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పీవీఆర్ చౌదరి మృతికి సంతాపం

కనిగిరి రూరల్: ఏఐటీయూసీ జిల్లా నాయకుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి, పీవీర్ చౌదరి మృతి సీపీఐ పార్టీకి తీరని లోటు అని సీపీఐ జిల్లా నాయకుడు వై రవీంద్రబాబు అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో పీవీఆర్ చౌదరి మృతి పట్ల ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సయ్యద్ యాసీన్, బృంగి సుబ్రహ్మణ్యం, జి.బాలిరెడ్డి, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు పి.మోహన్, వివిధ సంఘాల నాయకులు ఖాశింవలి, ఇప్రాజ్, పుట్టా సుబ్బారావు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సందర్శించిన విద్యార్థులు



లోక్ అదాలత్‌ను సందర్శిస్తున్న టీఆర్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు

కందుకూరు రూరల్: స్థానిక కోర్టు ఆవరణంలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌ను టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు కోటపాటి నరేష్ రాజు మాట్లాడుతూ ఏదైనా కేసులో ఇరు పార్టీల వారు ఉపశమనం పొందేందుకు జాతీయ న్యాయ సేవలు విభాగం తీసుకొచ్చిన ప్రత్యామ్నాయ కేసులు పరిష్కారాల ప్రక్రియే లోక్ అదాలత్ అన్నారు. జాతీయ స్థాయిలో సంవత్సరానికి నాలుగు సార్లు నిర్వహించే లోక్ అదాలత్ అనేది కక్షిదారులు తమ కేసులను పరిష్కరించుకోవడానికి ఒక సువర్ణ అవకాశమన్నారు. రాజనీతి శాస్త్ర విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొని కేసుల సరళి, కోర్టు ప్రొసిడింగ్స్, కేసుల రాజీ పద్ధతి, ఉచిత న్యాయ సహాయం, న్యాయవ్యవస్థ పనితీరును నిశితంగా పరిశీలించారు. కళాశాల ఐక్యూసీ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.రాజగోపాల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం విధిగా తీసుకోవాలి


పౌష్టికాహార ఆవశ్యకతపై ప్రదర్శనలో వివరిస్తున్న సూపర్‌వైజర్ పద్మజ


కనిగిరి ర్యాలీలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ పార్వతి

పామూరు: పౌష్టికాహార ఆవశ్యకతపై గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల తల్లులు అవగాహన కలిగి విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ అన్నారు. పామూరు అంకాళమ్మవీధి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. సూపర్ వైజర్ పద్మజ మాట్లాడుతూ అధిక పౌష్టికాహారం ఉన్న ముడిధాన్యాలు, పండ్లు, ఆకుకూరలు తినాలని సూచించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రత్యేకదృష్టి సారించి అన్ని వసతులు కేంద్రాల్లో కల్పిస్తున్నారన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్, నీరుకట్టు నాయబ్‌రసూల్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: పోషకాహార పదార్థాలతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తోందని సూపర్‌వైజర్ ఎంవీఎస్ పార్వతీ అన్నారు. మండలంలోని జమ్మలమడక అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ పార్వతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహార పదార్థాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోషకాహార విలువలు కల్గిన పదార్థాలను తీసుకోవడం వల్ల రక్తహీనత తగ్గుతుందన్నారు. తొలుత పోషకాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

లోక్ అదాలత్‌లో 49 కేసుల పరిష్కారం


కనిగిరి లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జి భరత్‌చంద్ర


కందుకూరు లోక్ అదాలత్‌లో కేసులను విచారిస్తున్న న్యాయమూర్తులు

కనిగిరి రూరల్: స్థానిక కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 49 కేసులు పరిష్కరించినట్లు కనిగిరి న్యాయమూర్తి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కె.భరత్‌చంద్ర తెలిపారు. లోక్ అదాలత్‌తో 39 క్రిమినల్ కేసులు, 6 సివిల్ కేసులు, 4 భరణం కేసుల్లో ఇరువర్గాల వారిని రాజీ చేసినట్లు జడ్జి తెలిపారు. కక్ష్యలు, కార్పణ్యాలకు వెళ్లకుండా, రాజీమార్గంలో వెళ్లి రాజమార్గాన్ని అనుసరించాలని జడ్జి కె.భరత్‌చంద్ర సూచించారు. చిన్న పొరపాటు, క్షణికావేశం, కారణంగా గొడవలు, మనస్పర్థలు పెట్టుకుని కేసులు దాకా వెళ్లి కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని వృథా చేసుకోవడమే కాకుండా, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాజీ మార్గమే రాజ మార్గం అని తెలిపారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

కందుకూరు: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులతో పాటు అన్ని రకాల కేసులను లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా సులభంగా పరిష్కరించుకోవచ్చునని సీనియర్ సివిల్ జడ్జి శోభా రాణి సూచించారు. స్థానిక కోర్టులో శనివారరం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా పలు రకాల కేసులను పరిష్కరించారు. వీటిలో సివిల్ కేసులు 9, క్రిమినల్ కేసులు 99, ప్రీ లిటిగేషన్ కేసులు 26, ఎస్టీ కేసులు 2053, వివాహ సంబంధ కేసులు 4, డీవీసీ ఒకటి, అడ్మిషన్స్ 28 కేసులను పరిష్కరించారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్ నిఖిల్‌రెడ్డి, లోకాధాలత్ మెంబర్లుగా బీవీ శేషయ్య, ఎస్‌కే షంషుద్దీన్, వీవీ సుబ్బారావు, ఎస్‌కే యాషిన్‌లు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ రమేష్, ఎం మల్లికార్జున, హరిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

హిందీ నేర్చుకుంటే మంచి భవిష్యత్


ఉలవపాడు: మాట్లాడుతున్న హిందీ అధ్యాపకుడు రఫీ


హిందీ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు రూపొందించి ప్రదర్శిస్తున్న చార్ట్స్

ఉలవపాడు: హిందీ నేర్చుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందని, దేశంలో ఎక్కడైనా మంచి ఉద్యోగం సంపాదించవచ్చని ర్ అధ్యాపకుడు రఫీ అన్నారు. స్థానిక ప్రభుత్వజూనియర్ కళాశాలలో హిందీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరు ప్రాయంలోనే ఎక్కువ భాషలు నేర్చుకుంటే మంచిదన్నారు. హిందీ భాష ప్రాంతాల మధ్య, వ్యక్తుల మధ్య దూరం తగ్గించి జాతీయ సమైక్యతకు దోహదం చేసిందన్నారు. ప్రిన్సిపాల్ గోపీచంద్, ప్రకాష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్

సీఎస్‌పురం(పామూరు): స్థానిక కేజీబీవీ విద్యాలయంలో హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. విద్యాలయం ఎస్ఓ షేక్ రేష్మ అధ్యక్షతన నిర్వహించినకార్యక్రమంలో హిందీ ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన హిందీ టీఎల్ఎం అండ్ ప్రాజెక్ట్‌మేళా విద్యార్థులను ఆలోచింపచేసింది. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలి


మాట్లాడుతున్న చైర్మన్ గఫార్, పక్కన కమిషనర్

కనిగిరి రూరల్: మున్సిపల్, సచివాలయాల్లో పనిచేసే శానిటేషన్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కార్మికులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున పారిశుధ్య కార్మికులు ప్రజా ఫిర్యాదులపై తక్షణం స్పందించాలన్నారు. కమిషనర్ డానియల్ జోసఫ్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు విధుల్లో ఉన్నప్పుడు సురక్షత ప్రమాణాలు పాటించాలన్నారు. తగు జాగ్రత్తలతో బూట్లు, గ్లౌజ్‌లు, తదితర ఆరోగ్య భద్రత వస్తువులను ధరించి పారిశుధ్య పనులు చేపట్టాలని తెలిపారు. పారిశుధ్యం పై వచ్చిన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని శానిటేషన్ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ ఏఈ కోటేశ్వరరావు, శానిటరీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎండు తెగులు నివారణపై అవగాహన


రైతులకు ఎరువును తయారు చేసే విధానాన్ని వివరిస్తున్న ఏఓ రాధ

పామూరు: ఎండు తెగులు నివారించే పద్ధతులపై రైతులు అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయాధికారి కంచం రాధ అన్నారు. మండలంలోని దూబగుంట్లలో శనివారం పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ రాధ మాట్లాడుతూ కందిలో ఇతర పంటల్లో నేలద్వారా సంక్రమించే ఎండుతెగులు నివారణకు ట్రైకోడెర్మావిరిడి అనే జీవ శిలీంధ్రనాశకాన్ని పశువుల ఎరువును ఉపయోగించి ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలో తెలియజేసి అవగాహన కల్పించారు. వర్షాల కారణంగా కందిలో గడ్డి జాతి కలుపు నివారణకు అంతరసేద్యంతో పాటు మెండుగా ఉన్న మొక్కలను తొలగించాలన్నారు.

దాడి చేసి చోరీ కేసులో ముగ్గురికి రిమాండ్

పామూరు: వ్యక్తిపై దాడి చేసి అతని వద్ద ఉన్న నగదు, ఉంగరం బలవంతంగా తీసుకుపోయిన ఘటనలో ముగ్గిరికి శనివారం జడ్జ్ రిమాండ్ విధించినట్లు ఎస్సై ఎం.వి.రాజేష్ తెలిపారు. వివరాలు... ఈనెల 6వ తేదీ రాత్రి నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం కృష్ణంరాజుపల్లె గ్రామానికి చెందిన 64 ఏళ్ల ఈర్ల తిరుపతయ్య పామూరులోని ఓ దుకాణంవద్ద నిద్రిస్తున్నాడు. ఈసందర్భంలో రాత్రి 11.30 గంటల సమయంలో ముగ్గురు వ్యక్తులు అతనిని బలవంతంగా ఆటోలో పామూరులోని డి.వి.పాలెం వద్ద చెట్లలోకి తీసుకుపోయి అతని వద్ద ఉన్న రూ.2 వేల నగదు, 7 గ్రాముల బంగారు ఉంగరం తీసుకుపోయారు. దీనిపై బాధితుడు ఈర్ల తిరుపతయ్య ఈనెల 10వ తేదీన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ యం.భీమానాయక్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్న పోలీసులు శనివారం నిందితులను మండలంలోని నుచ్చుపొద గ్రామానికి చెందిన కొలూరి నాయబ్‌రసూల్, చిలకపాడుకు చెందిన ఇర్ల రాజు, చట్టుమడుగు గ్రామానికి చెందిన కాకర్ల బాలసుబ్బారావులను అరెస్ట్‌చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి వారికి రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు. కేసును త్వరితగతిన ఛేదించేందుకు కృషిచేసిన హెడ్‌కానిస్టేబుల్ చెన్నకేశవులు, ఎం వెంకటేశ్వర్లు, డి.సిద్దయ్యలను సీఐ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


రోడ్డు ప్రమాదంలో మరణించిన ఆరిస్టాటిల్

ఒంగోలు టౌన్: రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. నెల్లూరు జిల్లా కందుకూరు పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన జెట్టి ఆరిస్టాటిల్ (25) మోటారు బైకుపై వెళ్తుండగా శనివారం సాయంత్రం 7.30 గంటల సమయంలో ఒంగోలు సంఘమిత్ర హాస్పిటల్ సమీపంలో వేగంగా వచ్చిన మినీ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆరిస్టాటిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. లారీని ఆపకుండా డ్రైవర్ వెళ్లిపోయాడు. ప్రత్యక్ష సాక్షులు కొందరు ఇచ్చిన సమాచారం మేరకు మేదరమెట్ల వద్ద లారీని పోలీసులు పట్టుకుని డ్రైవర్‌ని అదుపులోకి తీసుకున్నారు. ఒంగోలు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.